సాక్షి తిరుపతి

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



టీటీడీ ఉద్యోగులపై వరాల జల్లు

టీటీడీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీ కార్మికుల వేతనాలు పెంచుతూ టీటీడీ పాలక మండలి తీర్మానించింది. - 8లో



హృదయం కదిలించింది!

టీటీడీ శ్రీపద్మావతి హృదయాలయంలో గుండె మార్పిడి శస్త్రచికిత్స సోమవారం విజయవంతంగా పూర్తయింది. - 8లో



సీఎం జగన్‌కు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 76,577 మంది స్వామివారిని దర్శించుకోగా, 23,656 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.09 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


ఏనుగుల గుంపు బీభత్సం



వరి పొలంలో ఏనుగుల అడుగులను చూపుతున్న మహిళా రైతు

పాకాల: మండలంలో ఏనుగుల గుంపు పంట పొలాలపై బీభత్సం సృష్టించింది. ఆదివారం రాత్రి కాకర్లవారిపల్లి, మొరవపల్లి, ఐరాల మండలానికి చెందిన గూబలవారిపల్లి, వేదగిరివారిపల్లి, గుట్టపాళ్యం గ్రామాలకు సమీపంలోని పంట పొలాలను సర్వనాశనం చేసింది. మండల శివారు ప్రాంతాల్లోని ఓ రైతు పొలంలోని బావిలో ఏనుగు పడిపోయి, మరో ఏనుగు సహాయంతో బయటపడిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని స్థానిక రైతులు తెలిపారు. వరి, పండ్ల తోటలు దెబ్బతిన్నాయని వాపోయారు.

ప్రతి అర్జీకి పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని డీఆర్వో పెంచలకిషోర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు డీఆర్వోతో పాటు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, చంద్రశేఖర్, దేవేంద్రరెడ్డి, మురళి హాజరయ్యారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ప్రతివిభాగానికి చెందిన జిల్లా అధికారి స్పందనకు హాజరు కావాలని ఆదేశించారు. అలాగే సోమవారం అన్ని విభాగాలకు కలిపి జిల్లా వ్యాప్తంగా మొత్తం 151 వినతులు అందగా.. అందులో 122 వినతులు రెవెన్యూశాఖకు చెందినవని చెప్పారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా రథాలలో (1962) డ్రైవర్లుగా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈఎంఆర్ఐ, జీహెచ్ఎస్ తిరుపతి జోన్ మేనేజర్ రామలింగేశ్వర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించడంతోపాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జీ నంబర్ కలిగి, 40 ఏళ్ల లోపు వయసు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తిరుపతి శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలోని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ పరిధిలోని ఈఎంఆర్ఐ, జీహెచ్ఎస్ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10గంటల్లోపు హాజరు కవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 7207702466లో సంప్రదించాలని కోరారు.

మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్

తిరుపతి అర్బన్: ఆర్థిక అక్షరాస్యత (ఫైనాన్స్‌లిటరసీ) వారోత్సవాలను సోమవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ తెలిపారు. ఈ మేరకు 2024 పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించారు. జిల్లా స్థాయిలో 27వ తేదీన తిరుపతి గవర్నమెంట్ హై స్కూల్‌లో వ్యాసరచన, 28న పిచ్చాటూరులో క్విజ్, 29న గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ పాకాల క్రాస్ వద్ద ఆర్థిక అక్షరాస్యతపై వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతితోపాటు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్, సర్వే విభాగం జిల్లా అధికారి జయరాజ్ పాల్గొన్నారు.

ఆనంద పరవళ్లు





కృష్ణా జలాల విడుదలను వీక్షించేందుకు కుప్పం ఉప కాలువ గట్టుపై అశేష జనం (ఇన్‌సెట్) కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజలకు మేలు చేయాలన్న ఓ నాయకుడి ఆలోచనా విధానం.. ఓ మానవతావాది మహోన్నత ఆశయం.. ఓ సుపరిపాలకుడి నిరుపమాన సంకల్పం.. నేడు కళ్లెదుట సాక్షాత్కరించింది.. వందల కిలోమీటర్ల మేర వయ్యారాలు పోతూ.. కొండలు గుట్టలు దాటి ముందుకు సాగిన కృష్ణమ్మ ఎట్టకేలకు కరువు సీమను కరుణించింది. బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు పరవళ్లు తొక్కింది. కుప్పం వాసుల దాహార్తిని తీర్చేందుకు ఉప్పొంగింది. అన్నదాతల ఆశలను నెరవేర్చేందుకు వడివడిగా చెరువులకు చేరుతోంది. వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు మార్గం సుగమం చేసింది. వలస బతుకులకు 'చంద్ర' గ్రహణం నుంచి విముక్తి కల్పించే దిశగా ఉత్సాహంగా ఉరుకుతోంది. సోమవారం రామకుప్పం మండలంలోని రాజుపేట వద్ద హంద్రీ–నీవా సుజల స్రవంతిలో భాగంగా కుప్పం ఉప కాలువ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా విడుదలైన పవిత్ర కృష్ణా జలం.. ప్రజల్లో హర్షాతిరేకాలను ఇనుమడింపజేసింది.



జగనన్న ప్రసంగానికి ఈల వేస్తున్న చెల్లెమ్మ

- కుప్పంలో అట్టహాసంగా కృష్ణా జలాల విడుదల
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరా'జనం'
- కిలోమీటర్ల పొడవునా జేజేలు పలుకుతూ ఘన స్వాగతం
- సీఎం బహిరంగ సభకు పోటెత్తిన ప్రజానీకం
- ప్రసంగానికి ఆద్యంతం విశేష స్పందన
- తాగు.. సాగునీటి కష్టాలు తీర్చిన అపర భగీరథుడికి అభినందన
- కుప్పంపై వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి
- మరో రెండు రిజర్వాయర్లకు అనుమతులు



వేదపండితుల ఆశీర్వచనం

రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్లు

కుప్పం నియోజకవర్గంలో కరువును శాశ్వతంగా రూపుమాపే దిశగా ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. కృష్ణా జలాలను నిల్వ చేసేందుకు నూతనంగా రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసినట్లు ప్రకటించారు. శాంతిపురం మండలం ముద్దనపల్లె, గుడుపల్లె మండలం యామగానిపల్లె వద్ద ఈ రిజర్వాయర్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే పాలారు ప్రాజెక్టులో భాగంగా రూ.215 కోట్లతో 0.6 టీఎంసీల సామర్థ్యం గల చిన్నపాటి రిజర్వాయర్ నిర్మాణానికి సైతం పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు.

బృహత్తర కార్యక్రమం

కృష్ణా జలాలను కుప్పం తీసుకురావడం బృహత్తర కార్యక్రమని కలెక్టర్ ఎస్ షణ్మోహన్ తెలిపారు. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి నీటి విడుదల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. హంద్రీ–నీవా కాలువ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాగం నిరంతరం శ్రమించినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు రెండో దశలో భాగంగా 123 కిలోమీటర్ల బ్రాంచ్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసి 110 చెరువులకు నీరు నింపడం మహోత్తరమని కొనియాడారు. ఇందులో జిల్లా యంత్రాగాన్ని భాగస్వాములు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి, చిత్తూరు/శాంతిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ యావత్ కుప్పం నియోజకవర్గం తరలివచ్చింది. కిలోమీటర్ల పొడవునా ఎటుచూసినా జనమే. అన్ని దారులూ శాంతిపురం మండలంలోని గుండిశెట్టిపల్లె వద్ద ఏర్పాటు చేసిన సభ దిశగానే సాగాయి. 16 నెలల తర్వాత కుప్పానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. అడుగడుగునా జనం నీరాజనాలు పట్టారు.

ఆకట్టుకున్న ప్రసంగం

సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగానికి విశేష స్పందన లభించింది. జై జగన్ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. నవరత్న పథకాల ద్వారా కుప్పం ప్రజలకు చేకూరిన లబ్ధిని ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరిస్తుంటే ప్రజానీకం హర్షాతిరేకాలతో ఆలకించింది. విపక్షాలపై సంధించిన విమర్శనాస్త్రాలకు చప్పట్లతో సంపూర్ణ మద్దతు వ్యక్తం చేసింది. ఎమ్మెల్సీ భరత్‌ను రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రిని చేస్తామని, కుప్పం అభివృద్ధికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నామని భరోసా ఇస్తుంటే కేరింతలతో సంతోషాన్ని వెలిబుచ్చింది. మనసున్న మారాజు మా ముఖ్యమంత్రి అంటూ ఆశీర్వదించింది.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , ఆర్కే రోజా, అంబటి రాంబాబు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యేలు వెంకటేగౌడ్, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి , జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జాషువా, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలి అభిమానం



మేనమామను చూడాల్సిందే..



కృష్ణా జలాలు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జగన్‌మామయ్య సభకు మేము సైతం..



చెట్టెక్కిన అభిమానం..

గత పాలనకు.. మీ బిడ్డ పాలనకు బేరీజు వేసుకోండి



విశేష పూజలో...

కుప్పం నియోజకవర్గంలో గత 57 నెలలుగా జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. తన పాలనకు, గతంలో చంద్రబాబు పాలనను బేరీజు వేసుకుకోవాలని సూచించారు. కుప్పానికి కృష్ణమ్మ నీరు తీసుకొచ్చిన తర్వాతే ఓటు అడుగుతానని గతంలోనే చెప్పానని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని గుర్తుచేశారు. గతంలో చంద్రబాబు అరకొరగా చేసిన హంద్రీ–నీవా కాలువ పనులను పూర్తి చేసి, కుప్పానికి కృష్ణా జలాలు తీసుకువచ్చామని తెలిపారు. ఎమ్మెల్యేగా 34 ఏళ్లు, ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి చేయలేని పనులను సైతం తాను చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బాబు మాయమాటలకు మోసపోవద్దని సూచించారు.



సభకు పెద్దసంఖ్యలో హాజరైన ప్రజానీకం



జగనన్నకు జై కొడుతూ..

శాంతిపురంలోకి కృష్ణా జలాలు



రామనాథపురం కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహం

శాంతిపురం: హంద్రీ–నీవా ప్రాజెక్టులోని కుప్పం కాలువ ద్వారా కృష్ణా నదీ జలాలు సోమవారం సాయంత్రం శాంతిపురం మండలంలోకి ప్రవేశించాయి. రామకుప్పం మండలంలోని రాజుపేట వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా నీటిని విడుదల చేశారు. ట్రయల్ రన్ కారణంగా కాలువలో అప్పటికే నీరు ఉండడంతో ఒక్క రోజులోనే జలాలు శాంతిపురం మండలానికి చేరాయి. రాజుపేట నుంచి అత్తికుప్పం, కిలాకిపోడు ప్రాంతాల మీదుగా శాంతిపురం మండలంలోని అమ్మవారిపేట, వెంకటేశపురం, దండికుప్పం, గొల్లపల్లె, సంతూరు, రామనాథపురం మీదుగా గుండిశెట్టిపల్లె ప్రాంతానికి చేరుకున్నాయి. దీంతో స్థానిక రైతులు, ప్రజలు ఆనందంతో కాలువ నీటిలో దిగి కేరింతలు కొట్టారు.

క్లుప్తంగా

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



మాట్లాడుతున్న జేడీ వెంకటకృష్ణారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : రానున్న పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. తిరుపతి సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సోమవారం తిరుపతి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్, ఇంగ్లిష్, ఎకనామిక్స్, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల పీజీ టీచర్లకు అకడమిక్స్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఫలితాలను విశ్లేషిస్తూ ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఈఓ డాక్టర్ వీ.శేఖర్, సీబీఎస్ఈ రాష్ట్ర కోఆర్డినేటర్ సి.శ్రీలత, రాష్ట్ర ఏఎంఓ కె.ధర్మకుమార్, ఏఏఎంఓ ఎం.శరత్‌బాబు, తిరుపతి డీవైఈఓ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కి ఘన స్వాగతం


సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రేణిగుంట: చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గ పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. సీఎంకు విమానాశ్రయంలో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మద్దెల గురుమూర్తి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎస్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, ఎస్పీ మలికా గార్గ్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషా, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు సమన్వయకర్త, తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి నగర కమిషనర్ అదితి సింగ్, పద్మావతి విశ్వవిద్యాలయ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని తదితరులు స్వాగతం పలికారు.

సాదర వీడ్కోలు

చిత్తూరు జిల్లా పర్యటన అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 3.52 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని ఇక్కడి నుంచి 4.09 గంటలకు గన్నవరానికి బయల్దేరి వెళ్లారు. ఆయనకు విమానాశ్రయంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మేయర్ శిరీషా, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆలయ ఈవో నాగేశ్వరరావు సాదర వీడ్కోలు పలికారు.


వీడ్కోలు పలుకుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి


సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి , బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషా, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ఎస్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెలహరి

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరగనున్న వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు విమానాశ్రయానికి చేరుకుని ముఖ్యమంత్రిని శాలువతో సత్కరించి ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న ఎస్పీ మలికా గార్గ్

రేణిగుంట: సమాజ ప్రశాంతతకు, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిబద్ధతతో పని చేయాలని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశించారు. రేణిగుంట ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం రేణిగుంట డివిజనల్ స్థాయి పోలీసు అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్న తరుణంలో ప్రమాదకర మలుపులు, రోడ్ క్రాసింగ్‌లు, విద్యాసంస్థలు, రోడ్ డైవర్షన్లు ఉన్న చోట సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరికల స్టిక్కర్లను అతికించాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని చెప్పారు. చిన్నపిల్లలు, మహిళలకు సంబంధిచిన ఫిర్యాదుల పట్ల త్వరితగతిన స్పందించాలని సూచించారు. దిశా ఎస్ఓఎస్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా అందే ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండి సంఘటన స్థలానికి త్వరితగతిన చేరుకోవాలని స్పష్టం చేశారు. కేసుకు సంబంధించి బలమైన ఆధారం లేకుండా అమాయకులను, సామాజిక బలహీనులను హింసించడం వంటి చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మత్తు పదార్థాల సరఫరా నిషేధంపై పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌వోలు ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటించి గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే సమస్యలుంటే తక్షణమే ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించాలన్నారు. రేణిగుంట రైల్వే జంక్షన్ మీదుగా ప్రయాణికుల ముసుగులో అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని, పోలీసులు నిఘాపెట్టి తరచూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిష్టాత్మక జాతీయ విద్యాసంస్థలు ఉన్న నేపథ్యంలో రాత్రింబవళ్లు బీట్ సిస్టంను మెరుగుపరచాలన్నారు. రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి తగిన భద్రత కల్పిస్తూ పోలీసుల ఖ్యాతిని పెంచాలన్నారు. ప్రతి స్టేషన్లోని అధికారి తమ పరిధిలోని సిబ్బంది పనితీరు పట్ల నిఘా ఉంచి, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధితులకు న్యాయం చేయడంలో బాధ్యతగా వ్యవహరించి పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాలన్నారు. ఈ సమావేశంలో రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్, భాస్కర్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్


అరెస్ట్ చేసిన నిందితులను చూపుతున్న రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున

రేణిగుంట: మండలంలోని మల్లవరం సమీపంలో ఉన్న సంతోష్ దాబాలో ఈనెల 21న యాత్రికులపై జరిగిన దాడి కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున తెలిపారు. ఈనెల 21న రాత్రి మహారాష్ట్రకు చెందిన 9మంది యాత్రికులు దాబా ముందు మైదానంలో కూర్చుని భోంచేస్తుండగా, తిరుపతికి చెందిన ఆరుగురు బొలెరో వాహనంలో వచ్చి వారి ముందు సడెన్ బ్రేక్ వేశారన్నారు. దీంతో దుమ్ము పైకి రావడంతో మహారాష్ట్రకు చెందిన యాత్రికులు వారిని ప్రశ్నించడంతో దాడికి తెగబడ్డారు. మహారాష్ట్రకు చెందిన వారిలో ప్రశాంత్ జగపత్, కులదీప్, అమరదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్ జగపత్(45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో నిందితులు తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన చిత్తూరు హర్షవర్ధన్ అలియాస్ హర్ష(26), జీవకోనకు చెందిన మాధవాలి సాయికుమార్ అలియాస్ సాయి(27), అబ్బన్నకాలనీ అశోక్‌నగర్‌కు చెందిన పర్వతం దినేష్‌రాజు అలియాస్ దినేష్(27), జీవకోన రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన సేమలబోయిన చంద్రశేఖర్ అలియాస్ చిరు((33), తిరుపతి అక్కారంపల్లి సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన లింగంగుంట పవన్(25), కొర్లగుంట సంజీవ్‌గాంధీ కాలనీకి చెందిన బత్తరపల్లి తిరుపాల్(27)లను రేణిగుంట ఆర్టీసీ బస్టాండు సమీపంలో సోమవారం అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

హృదయం కదిలించింది!

- 40 ఏళ్ల వ్యక్తికి గుండె మార్పిడి
- టీటీడీ శ్రీ పద్మావతి హృదయాలయంలో 12వ గుండె మార్పిడి
- సీఎం రిలీఫ్ ఫండ్, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఖరీదైన వైద్యం


గుండెను తీసుకొస్తున్న సిబ్బంది

తిరుపతి తుడా: టీటీడీ శ్రీ పద్మావతి హృదయాలయంలో 12వ గుండె మార్పిడిని విజయవంతంగా చేపట్టారు. 40 ఏళ్ల వ్యక్తికి 28 సంవత్సరాల యువకుడి గుండెను వైద్యులు అమర్చారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలోని వైద్యుల బృందం సోమవారం రాత్రి 6 గంటలకు పైగా శ్రమించి గుండె మార్పిడి ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారు.

విజయవంతంగా గుండె మార్పిడి: విశాఖపట్నం ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల యువకుడు గుండె సంబంధిత సమస్యతో వైద్యం చేయించుకుంటున్నారు. రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలియడంతో కుటుంబ సభ్యులు టీటీడీ పరిధిలోని శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌ను ఆశ్రయించారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు గుండె క్షీణించి సామర్థ్యం కోల్పోయినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో గుండె మార్పిడి అనివార్యమని తేల్చారు. 10 రోజులుగా ఆస్పత్రిలోనే చికిత్సను అందిస్తున్నారు. జీవన్‌దాన్‌లో వైద్యులు వివరాలను నమోదు చేశారు. ఈ క్రమంలో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన 28 సంవత్సరాల యువకుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న శ్రీ పద్మావతి కార్డియాక్ సెంటర్ వైద్యుల బృందం శ్రీకాకుళం వెళ్లి గుండెను సేకరించారు. ఆ గుండెను 40 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా మార్పిడి చేసి పునర్జన్మను ప్రసాదించారు. సీఎం రిలీఫ్ ఫండ్ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా సుమారు రూ.12 లక్షలకు పైగా ఖర్చయ్యే ఈ గుండె మార్పిడి ని పూర్తి ఉచితంగా చేపట్టారు.

ఇంటికి రంగులేస్తూ.. తిరిగిరాని లోకాలకు

- విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన అఫ్జల్, చికిత్స పొందుతున్న అల్లాభక్షు

గూడూరు రూరల్: పట్టణంలోని సనత్‌నగర్ ప్రాంతంలో ఓ ఇంటికి రంగులు వేస్తున్న సమయంలో ఇంటి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం.. పట్టణంలోని సమాజుకట్ట, మసీదువీధి ప్రాంతాలకు చెందిన అఫ్జల్(52), అల్లాభక్షు పెయింట్ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరిరువురూ సనత్‌నగర్ ప్రాంతంలోని ఓ ఇంటికి రంగులు వేసేందుకు కూలికి వెళ్లారు. ఇంటి బయట రంగులు వేస్తున్న సమయంలో పక్కనే వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగ తగలడంతో అఫ్జల్‌కు తీవ్ర గాయాలై మిద్దె పైనుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే అతనితో ఉన్న అల్లాభక్షుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అల్లాభక్షుకు మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఒకటవ పట్టణ ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.

ఎస్ఐ..కానిస్టేబుల్‌కు జైలు

ఒంగోలు : పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తిని అన్యాయంగా కొట్టిన కేసులో ఎస్ఐ, కానిస్టేబుల్‌కు 8 ఏళ్ల జైలుశిక్ష, రూ.23వేల చొప్పున జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా సోమవారం తీర్పునిచ్చారు. వివరాలు.. 2016లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జె.పంగులూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా జగన్‌మోహన్‌రావు(ప్రస్తుతం తిరుపతి సీసీఎస్), కానిస్టేబుల్‌గా కాసా కిరణ్‌కుమార్ (ప్రస్తుతం చీరాల రైల్వేస్టేషన్) పనిచేస్తున్నారు. అదే స్టేషన్ పరిధిలోని కోటపాడు గ్రామంలో నేలపాటి ఇమ్మానుయేలు, మందా వెంకటేశ్వర్లు ఘర్షణ పడ్డారు. దీనిపై ఇరువురూ పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని రాజీ కుదిర్చారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐకు విషయం వివరించారు. అయితే ఎస్ఐ ఆగ్రహంతో ఫిర్యాదీల్లో ఒకరిపై దాడి చేశారు. ఇదేంటని ప్రశ్నించిన తిరుపాలు అనే వ్యక్తిని సైతం కానిస్టేబుల్‌తో కలిసి చెంపలపై కొట్టడంతో పాటు చొక్కా పట్టుకుని ఈడ్చుకుంటూ వెళ్లి రబ్బరు ట్యూబ్‌తో దాడి చేశాడు. ఈ క్రమంలో బాధితుడు తిరుపాలు ఆస్పత్రిలో చికిత్సపొంది, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు విచారించిన కోర్టు నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధించింది.

టీటీడీ ఉద్యోగులపై వరాల జల్లు


మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

- టీటీడీ చరిత్రలో సరికొత్త అధ్యాయం
- కాంట్రాక్టు, సొసైటీ ఉద్యోగులకు జీతాల పెంపు
- చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 15 వేల మందికి వర్తింపు
- సీనియారిటీ, కేడర్‌ను బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు పెంపు
- రెగ్యులర్ ఉద్యోగులకు ఇప్పటికే ఇంటిస్థలాల పంపిణీ
- పేదలు , ఉద్యోగుల పక్షపాతినని మరోసారి రుజువు చేసుకున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల: టీటీడీ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో కాంట్రాక్టు, సొసైటీల ద్వారా టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులపై చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వరాల వాన కురిపించారు. రెగ్యులర్, రిటైర్డ్ ఉద్యోగుల 30 ఏళ్ల ఇంటి స్థలాల కలను నెరవేర్చారు. గత బోర్డు సమావేశాల్లో పారిశుద్ధ్య, పోటు, ఉగ్రాణం, వేద పాఠశాలలు, శిల్పకళాశాలతో పాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరు వేల మంది కాంట్రాక్టు, సొసైటీ, సంభావన ఉద్యోగుల జీతాలు పెంచారు. మిగిలిన 9,750 మందికి కూడా కేడర్, సీనియారిటీని బట్టి రూ.3 వేల నుంచి రూ.20వేల వరకు జీతాలు పెంచుతూ సోమవారం జరిగిన బోర్డు సమావేశంలో ఆమోద ముద్ర వేశారు. ఈ నిర్ణయంతో టీటీడీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి జీతం పెరిగినట్లయింది. 15 ఏళ్ల నిరీక్షణకు తెరపడినట్లయింది. దీనిపై ఉద్యోగులు సర్వత్రా ఆనందంలో మునిగితేలుతున్నారు.

ఉద్యోగుల క్యాంటీన్లో భోజనం

టీటీడీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు తిరుమల ఎంప్లాయీస్ క్యాంటీన్‌లో అల్పాహారం, భోజనం అందించడానికి టీటీడీ చైర్మన్ నిర్ణయం తీసుకున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఇక మీదట రాయితీ ధరతో వీరికి కూడా టిఫిన్, భోజనం, టీ, కాఫీ అందిస్తారు.

బోర్డు తీర్మానంలో ఆమోదించిన అంశాలు

- వడమాలపేట పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్లస్థలాల లేఔట్, ఇతర అభివృద్ధి చార్జీలకు సంబంధించి రూ.8.16 కోట్లు తుడాకు చెల్లించేందుకు ఆమోదం. ఈ మొత్తాన్ని టీటీడీ ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు.
- తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో రూ.3.89 కోట్లతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అత్యంత సుందరంగా లైటింగ్ ఏర్పాటు.
- అలిపిరి వద్దగల సప్త గోప్రదక్షిణ మందిరంలో గత ఏడాది నవంబర్ 23 నుంచి ప్రారంభమైన శ్రీనివాస దివ్యానుగ్రహ హోమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.4.12 కోట్లతో శాశ్వత యాగశాల నిర్మాణానికి ఆమోదం. ఇందుకోసం టీటీడీ బోర్డు సభ్యుడు శేఖర్ రెడ్డి రూ.1.38 కోట్ల విరాళంగా అందించేందుకు ముందుకువచ్చారు.
- తిరుమల సప్తగిరి విశ్రాంతి భవనంలోని 1, 4 బ్లాకుల ఆధునీకరణకు రూ.3.19 కోట్లు మంజూరు.
- తిరుమలలోని పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార, ఇతర ప్రాంతాల్లోని 682 మోటార్ పంపు సెట్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు రూ.3.15 కోట్లు మంజూరు చేసేందుకు ఆమోదం.
- తిరుమలలో వివిధ ప్రాంతాల్లో ఉన్న అతిథి భవనాలు, పీఏసీలలో ఎఫ్ఎంఎస్ సేవలను మరో మూడేళ్లు పొడిగించాలని నిర్ణయం.
- తిరుపతిలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులకు నూతన బంగారు కవచాల తయారీకి ఆమోదం . అదేవిధంగా రూ.15 లక్షలతో రెండు తండ్లకు బంగారు మలాం వేసిన కాపర్ రేకులు ఏర్పాటు చేసేందుకు ఆమోదం.
- శ్రీ వేంకటేశ్వరస్వామివారి చెల్లిగా ప్రసిద్ధి చెందిన తిరుపతిలోని శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గతేడాదిలాగే జాతర నిర్వహణకు రూ.50 లక్షలు మంజూరుకు ఆమోదం.
- తిరుపతి హరేరామ హరే కృష్ణ రోడ్డులోని ఇన్‌కమ్ ట్యాక్స్ గెస్ట్ హౌస్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో రూ.7.51 కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆమోదం.
- అలిపిరి కాలినడక మార్గంలోని గాలిగోపురం, లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం వద్దగల ముగ్గుబావుల ఆధునీకరణ.

దేవుడు ఇందుకే నాకు మళ్లీ అవకాశం ఇచ్చారేమో

"నా జీవితంలో ఈరోజు మరిచిపోలేనిది. నాకు అత్యంత సంతృప్తి కలిగించింది. నేను స్వతహాగా పేదలు, ఉద్యోగుల పక్షపాతిని. నా ద్వారా టీటీడీలోని ఉద్యోగులందరికీ మేలు జరగడం.. వారికి జీతాలు పెంచడం.. ఇంటి స్థలాలు అందించడం.. ఎంతో సంతోషం కలిగించింది. ఇంత మందికి మేలు చేయించడానికే శ్రీ వేంకటేశ్వర స్వామి వారు నాకు రెండోసారి చైర్మన్‌గా అవకాశం ఇచ్చారేమో అనిపిస్తోంది. నా ద్వారా 9వేల మంది ఉద్యోగులకు మేలు జరగడం మరచి పోలేను.

- భూమన కరుణాకర రెడ్డి, టీటీడీ చైర్మన్

ఉద్యోగులకు వరం



తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి రెండో సారి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఉద్యోగులకు ఓ వరం. ఎన్నడూ లేనివిధంగా ఈ ఐదేళ్లలోనే ఉద్యోగులకు మంచి జరుగుతోంది. ఇప్పటికే ఉద్యోగుల 30 ఏళ్ల సొంతింటి కల నెరవేరింది. ప్రస్తుతం బోర్డు సమావేశంలో ఉద్యోగులకు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం కలిగింది. కిందిస్థాయి ఉద్యోగులు రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పనిచేస్తున్న వారున్నారు. వీరందరికీ వేతనాలు పెంచడం సంతోషకరం.

- వెంకటరమణారెడ్డి, టీటీడీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు

చరిత్రాత్మక నిర్ణయం



ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి కేడర్‌ను బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు టీటీడీ ఉద్యోగలకు జీతాలు పెంచడం చరిత్రాత్మక నిర్ణయం. టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి పేదలు.. ఉద్యోగుల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారు. పెంచిన జీతాలను వీలైనంత త్వరగా అమలు చేయాలి.

- చీర్ల కిరణ్, టీటీడీ బ్యాంకు-ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు

ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు



ఉద్యోగుల జీతాల పెంపుదల చేస్తూ టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. చిన్న ఉద్యోగుల కుటుంబాల్లో ఆయన వెలుగులు నింపారు. ఇదొక మంచి పరిణామం. కరుణాకరరెడ్డి ఉద్యోగుల సంక్షేమంపై మంచి సామాజిక బాధ్యతతో చేసిన కార్యంగా చూడొచ్చు. అధికారాన్ని అవసరాలు ఉన్న వారికి ఉపయోగించి మంచి చేస్తే ఆ వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుంది.

- డాక్టర్ మేడికొండ ప్రభాకర్‌రావు, అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం

కరుణాకరరెడ్డి పేదల పక్షపాతి



టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి మానవతా విలువలు కలిగి.. పేదల సంక్షేమాన్ని ఆకాంక్షించే వ్యక్తి. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో సాహసోపేతం. ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఇదివరకే ఉద్యోగులందరికీ ఇంటి పట్టాలు అందించి అందరి హృదయాల్లో నిలిచారు. ఇప్పుడు జీతాలు పెంచడంతో చిన్న ఉద్యోగులు.. వారి కుటుంబ సభ్యులు కరుణాకరరెడ్డి సేవలను చిరకాలం గుర్తుపెట్టుకుంటారు. ఆయన సేవలకు కృతజ్ఞతలు.

- జాటోత్ భాస్కర్ , ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి